క్లుప్తంగా

పొగాకు పంట పరిశీలన


పొగాకు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నంద్యాల (అర్బన్) : ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇటీవల విడుదలైన నంద్యాల పొగాకు–1, నంద్యాల పొగాకు–2,హైబ్రిడ్ బీడి పొగాకు పంటలను అఖిలభారత సమన్వయ పథకం శాస్త్రవేత్తలు పుల్లిబాయి,సతీష్‌బాబు పరిశీలించారు. బుధవారం నందికొట్కూరు,మిడుతూరు మండలాల్లో సాగుచేసిన పంటలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ నంద్యాల పొగాకు రకం పంట వర్షాభావపరిస్థితుల్లోనూ మంచి దిగుబడులు వచ్చేలా ఉన్నాయన్నారు. ఎకరాకు 1,200 కేజీల దిగుబడులు రానున్నాయని చెప్పారు. పంటలను అక్కడక్కడ పొగమల్లె తెగులు ఆశించిందని నివారణకు ఇమాజితాపిర్ అనే కలుపు మందును లీటరు నీటికి 1ఎంఎల్ చొప్పున నాటిన 70 రోజుల నుంచి వందరోజుల లోపు పిచికారీ చేయాలని సూచించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


కేవీ నాగేశ్వరయ్యను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జాతీయ ప్రతిభ పురస్కార గ్రహీత కేవీ నాగేశ్వరయ్యను బుధవారం ఘనంగా సన్మానించారు. కొత్తా పూర్ణానంద విలాస్ కళావేదిక విజయవాడలో శ్రీశ్రీ కళా వేదిక సంస్థ అధ్యక్షుడు ప్రతాప్, వరల్డ్ పొయట్రీ, తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ ప్రతిభా పురస్కారం, తెలుగుకీర్తి బిరుదుతో సత్కరించారు. నాగేశ్వరయ్య నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో రంగస్థల కళాకారుడిగా సామాజిక చైతన్యం కోసం నాటక ప్రదర్శలు ఇవ్వడమే కాక రచనా ప్రస్థానాన్ని కొనసాగిస్తూ ధార్మిక, సామాజిక కార్యక్రమాలు కళారంగంలోనూ రాణిస్తున్నారన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

- ఆళ్లగడ్డ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కొలికిపూడి ప్రమోద్



ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రత పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామని కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ కొలికిపూడి ప్రమోద్ తెలిపారు. ఆళ్లగడ్డ డీఎస్పీగా నియమితులైన ఆయన గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రత విషయంలో రాజీపడబోమన్నారు. రాత్రి వేళల్లో గస్తీ పెంచుతామని, దొంగలు, నేరగాళ్లు, పాత నేరస్థులు, రౌడీసీటర్లపై నిఘా ఉంచి వారి కదిలికలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు.

మిశ్రమ పంటలను శ్రీకారం చుట్టాలి


చాకరాజువేముల గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం

దొర్నిపాడు: మిశ్రమ పంటల సాగుకు రైతులు శ్రీకారం చుట్టాలని వ్యవసాయాధికారి ప్రమీల సూచించారు. బుధవారం చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మిను ము జొన్న, బెండ, వేరుశనగ పంటల్లో మిశ్రమ పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు.

పరిశ్రమల స్థాపనతోనే ఉపాధి

నంద్యాల(న్యూటౌన్): వెనుకబడిన రాయలసీమ జిల్లాల యువతకు ఉపాధి కావాలంటే నూతన పరిశ్రమల స్థాపనతోనే సాధ్యమని నూతన పరిశ్రమల స్థాపన కోసం ఏఐవైఎఫ్ సమరశీల పోరాటాలకు సిద్ధంగా ఉందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా ప్రథమ మహాసభను రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జిల్లా అధ్యక్షు అనంతనం నూతన కమిటీ ఎన్నుకున్నారు.

నైపుణ్యాల వెలికితీతకు బాలోత్సవాలు దోహదం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికి తీసేందుకు నంది బాలోత్సవాలు దోహదపడతాయని డీఈఓ జనార్దన్ రెడ్డి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రాకేష్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ద్వితీయ బాలోత్సవం నిర్వహించారు. మున్సిపల్ టౌన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలు మూలల నుంచి 3వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. నంది బాలోత్సవ ఆర్గనైజర్ రామరాజు, ప్రధాన కార్యదర్శి భాస్కరరావు, గౌరవ సలహాదారులు శంకరయ్య, మౌలాలి, గురుస్వామి, ప్రసాద్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు రాక..

నిర్మాణం పూర్తికాక!

- గోదాములుగా అంగన్‌వాడీ భవనాలు
- నివాసాలుగానూ వినియోగించుకుంటున్న వైనం
- నాడు–నేడు కింద ఏడు భవనాల నిర్మాణానికి అనుమతులు
- రూ.13లక్షల ప్రకారం నిధుల కేటాయింపు
- అర్ధంతరంగా ఆగిన పనులు
- నిధులు విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- వసతులు లేక అవస్థలు పడుతున్న చిన్నారులు


పేరూరులో బేస్‌మెంట్ లెవెల్‌లో నిలిచిన నిర్మాణం

రుద్రవరం: గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద మండలంలో 7అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరయ్యాయి.ఒక్కో భవనానికి రూ.13 లక్షల చొప్పున మంజూరు చేశారు. ఆ నిధులతో భవనాలు నిర్మించేందుకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్త, ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీస్, కేంద్రంలోని ప్రీ స్కూల్ పిల్లల తల్లులు ఐదుగురు కలిపి మొత్తం 9 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. వారి సమక్షంలో పనులు చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ నిబంధనల ప్రకారం ఆయా గ్రామాల్లో పనులు ప్రారంభించారు. నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్కో భవనానికి దాదాపు రూ.7లక్షల వరకు నిధులు మంజూరు చేసింది. అయితే పనులు సాగుతున్న దశలో ప్రభుత్వం మారింది. దీంతో అప్పటి నుంచి భవన నిర్మాణాలు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేటాయించిన బడ్జెట్‌లో నిధులు విడుదల చేయలేదు. దీంతో భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మండలంలోని నర్సాపురం, ముత్తలూరు, శ్రీరంగాపురం,డీ.కొట్టాల గ్రామాలకు మంజూరైన ఐదు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు పై కప్పులు వేశారు. కొండమాయపల్లె, పేరూరు గ్రామాల్లో బేస్‌మెంట్‌లెవెల్లో నిలిచిపోయాయి. చంద్రబాబు అధికారం చేపట్టినప్పటి నుంచి నుంచి నిధులురాక, భవనాలు పూర్తిగాక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇప్పట్లో నిర్మాణాలు పూర్తి కావని గ్రామస్తులు వాటిని గోదాములు, పశుగ్రాసం నిల్వ కేంద్రాలుగా, మరికొందరు నివాసాలుగా మార్చుకున్నారు. నూతన భవనాలు వినియోగంలోకి రాక పోవడంతో అద్దె భవనాల్లో సరైన వసతులులేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవిని వివరణ కోరగా.. ఇటీవల ఆళ్లగడ్డ ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించామని, అక్కడ అసంపూర్తి భవనాలపై చర్చించామన్నారు. త్వరలోనే నిధులు వచ్చే అవకాశం ఉందని, నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించాలని చెప్పామన్నారు. నిర్మాణ భవనాల్లో నిల్వ చేసిన ధాన్యం, పశుగ్రాసాన్ని తొలగిస్తామని, నివాసం ఉండేవారిని బయటకు పంపుతామని చెప్పారు.


డీ.కొట్టాలలో పైకప్పు వేసిన దృశ్యం


శ్రీరంగాపురం భవనంలో ధాన్యం నిల్వ చేసిన దృశ్యం


శ్రీరంగాపురం ఎస్సీ కాలనీలో నివాసంగా మార్చుకున్న దృశ్యం


శ్రీరంగాపురంలో వేసిన పశుగ్రాసం

క్షేత్రస్థాయి అభ్యసనం మంచి అనుభవం


తువ్వపల్లె పొలాల్లో వరి నాట్లు వేస్తున్న విద్యార్థులు

రుద్రవరం: విద్యార్థి దశలోనే వ్యవసాయం గురించి తెలుసుకోవడం రాబోయే రోజుల్లో వారికి ఓ అనుభవంగా గుర్తుండి పోతుందని రుద్రవరం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన పాఠశాలలోని తొమ్మిదో తరగతి విద్యార్థులతో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు దగ్గరలో ఓ రైతు వరి నాట్లు వేస్తుండగా విద్యార్థులకు అక్కడికి తీసుకెళ్లారు. అక్కడ విద్యార్థులు రైతుతో మాట్లాడుతూ.. నాటు వేసే విధానం, వేసే ఎరువులు, పిచికారీ మందులు, ఎన్ని రోజులకు పంట వస్తుందనే విషయాలు అడిగి తెలుసుకు న్నారు. వ్యవసాయంపై పుస్తకాల్లో చదవడం కనా క్షేత్ర స్థాయిలో తెలుసుకుంటే వారికి బాగా అర్థం అవుతుందనే పొలాల వద్దకు తీసుకెళ్లామని చెప్పారు. అగ్రికల్చర్ ట్రైనర్ జ్యోతిప్రియ, పీడీ శ్రీనివాసులు,ఉపాధ్యాయులు ఉన్నారు.

పాడితో జీవనోపాధి


పాడిరైతులకు మందులను అందజేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: పాడి కుటుంబానికి జీవనోపాధిని చూపిస్తుందని, ప్రతి ఒక్కరూ పాడిని పెంపొందించుకోవాలని పశువైద్యాధికారి కేవీఆర్ పుల్లయ్య సూచించారు. బుధవారం మండలంలోని బుర్రారెడ్డిపల్లె గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. 192 పశువులకు వైద్యచికిత్స చేసినట్లు చెప్పారు. 12 పాడి గేదెలకు గర్భకోశ సంబంధిత సమస్యలకు చికిత్స అదించడంతో పాటు 321 గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపినట్లు చెప్పారు. 250 గొర్రెలకు మశూచి టీకాలు వేశామన్నారు. అనంతరం పాడి, గొర్రెల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేవీఓ రమణయ్య, ఉప సర్పంచి బాలసుబ్బయ్య పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు నాగశైలజ, రవీంద్రనాథరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని సుద్దమల్ల, అల్లూరు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పశుపోషకులకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అలాగే గర్భకోశ, నట్టల నివారణ సంబందించి వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

కుష్టు వ్యాధి సర్వే పకడ్బందీగా చేయండి


నర్సాపురంలో సర్వేను పరిశీలిస్తున్న లెప్రసీ జిల్లా అధికారి తేజస్విని

రుద్రవరం: పీహెచ్‌సీ పరిధిలో సాగుతున్న కుష్టు వ్యాధి సర్వేను పకడ్బందీగా చేయాలని లెప్రసీ జిల్లా అధికారి తేజస్విని సిబ్బందికి సూచించారు. మండలంలోని నర్సాపురం పీహెచ్‌సీ పరిధిలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చేస్తున్న సర్వేను బుధవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌సీడీసీ సర్వే గత నెల 25 నుంచి సాగుతోందని అలాగే ఈ సర్వే ఈ నెల 25 వరకు సాగుతుందని చెప్పారు. అనంతరం పీహెచ్‌లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీఎంఓ హక్, వైద్యాధికారి బాబు ఉన్నారు.

ఉయ్యాలవాడ : కుష్టు వ్యాధి నిర్మూలనకు ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని వైద్యాధికారి రాబర్ట్ కెనడీ అన్నారు. బుధవారం మండలంలోని మాయలూరు పీహెచ్‌సీ పరిధిలోని తుడుమలదిన్నె గ్రామంలో కుష్టు వ్యాధి నివారణ సర్వే ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సిబ్బంది వివరాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్వే ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. వ్యాధి గ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్య సేవల కోసం ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తామని చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, కృష్ణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం


అధ్యాపకులతో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగలింగారెడ్డి

ఆళ్లగడ్డ: డిగ్రీ వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగలింగారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో అడ్మిషన్లను పెంచి వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర గంగన్న, అధ్యాపకులు నాగమస్తాన్, విజయలక్ష్మి, డాక్టర్ జయచంద్రుడు, వెంకటేష్ కుమార్, స్వరూప ఉన్నారు.

● లోక కల్యాణం కోసం హోమాలు


శ్రీ సుదర్శన, సుబ్రహ్మణ్య హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్‌లో వెలసిన రామాలయంలో లోక కల్యాణం కోసం శ్రీభగవత్ సేవా సమాజం ఆధ్వర్యంలో శ్రీ మహా సుదర్శన యాగ పూర్వక అష్ట నాగా అశ్లేష బలి పూజ సహిత, శ్రీ సుబ్రహ్మణ్య యాగాలు బుధవారం వేదంపండితులు కార్తికేయ శర్మ నిర్వహణలో జరిపించారు. ఉదయం గోపూజ, మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, మాతృకా పూజ, నాందిపూజ, కాంకణధారణ, ప్రధాన కళష యాగ ఆరాధనలు, పంచగవ్య పూజలతో పాటు శ్రీ సుదర్శన హోమం, శ్రీ సుబ్రహ్మణ్య యాగం శాస్త్రోక్తంగా మొదటి రోజు చేపట్టారు. ఆలయ నిర్వాహకులు సూరయ్య, శ్రీనివాసులు మాట్లాడుతూ లోకకల్యాణం కోసం ఐదు రోజుల పాటు హోమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఆదివారం పూర్ణాహుతితో ముగిస్తామన్నారు.

యాదవాడ చేరిన పార్వేట పల్లకీ


ఉత్సవ పల్లకీకి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉత్సవమూర్తులు శ్రీ జ్వాల నరసింహస్వామి, శ్రీ ప్రహ్లాదవరదస్వామి వార్ల పల్లకీ యాదవాడ గ్రామంలో కొలువు దీరింది. గ్రామ పొలిమేర తెలుపుపై కొలువైన ఉత్సవమూర్తులకు గ్రామ ప్రజలు తరలివచ్చి విశేష పూజలు నిర్వహించి గ్రామంలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామస్తులు భుజాలపై మోసుకుంటూ తెలుపులపై కొలువుంచగా స్థానికులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

జూదరుల అరెస్టు

రుద్రవరం: మండలంలోని హరినగరం పొలిమేరలో కోడి పందెం ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ బుధవారం తెలిపారు. హరినగరానికి సమీపంలోనున్న అటవీ ప్రాంతంలో కోడి పందాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా.. రుద్రవరం,గోవిందపల్లె,ఆళ్లగడ్డ, బాచుపల్లె, రామ చంద్రాపురం, శుద్దపల్లె గ్రామాలకు చెందిన 11 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.43,400 నగదు, 10 మోటార్ సైకిళ్లు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

పింఛన్ల విచారణ నిష్పక్షపాతంగా చేయాలి

నంద్యాల(అర్బన్): వికలాంగ పెన్షన్ల పరిశీలనను నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులు పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు.కిరణ్‌కుమార్,ఎల్లయ్య,ఖాదర్‌బాషా ఉన్నారు.

పిల్లల భవిష్యత్‌కు తోడ్పడాలి

నంద్యాల(న్యూటౌన్): పిల్లల భవిష్యత్‌కు తల్లిదండ్రులు తోడ్పడాలని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమాంత కుమార్ అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా ఉప విద్యాశాఖ అధికారి సమావేశ భవనంలో గ్రహణ మొర్రి, గ్రహణ శూల నిర్ధారణ క్యాంప్‌ను నంద్యాల సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కాంప్యును బసవతారకం స్మైల్ ట్రైన్ సెంటర్, ఇండో అమెరికన్ క్యాన్సర్ వైద్యులు ముకుంద రెడ్డి, జ్యోషి, రవితేజ బృందం హాజరై 46 మంది పిల్లలను పరీక్షించారు. వీరిలో 26 మందికి ఆపరేషన్లు అవసరమని, వారికి హైదరాబాద్ ఆసుపత్రికి పంపుతామన్నారు. జిల్లా సహిత అధికారి రఘురామిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంత్రంలా.. యంత్రాలు

- గంటల్లో ఇంటికి చేరుతున్న ధాన్యం
- ఆధునిక వ్యవసాయ యంత్రాలతో రైతన్నకు తగ్గిన శ్రమ
- విత్తు నుంచి పంట ఇంటికి వచ్చేవరకు మిషన్ తోడు


మినుము పంటను కోస్తున్న యంత్రం


పొట్టు కోసం..


జొన్న పంటకు డ్రోన్ సాయంతో పురుగు మందు పిచికారీ

దొర్నిపాడు: ఒకప్పుడు విత్తు విత్తినప్పటి నుంచి పండిన పంట ఇంటికి చేరేవరకు రైతన్నకు కాడెడ్లు తోడుగా ఉండేవి. దీంతో ధాన్యం ఇంటికి చేరాలాంటే వారాల సమయం పట్టేది. ప్రస్తుతం ఆధునిక వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి రావడంతో మంత్రంలా పనిచేస్తున్నాయి. గంటల వ్యవధిలోనే దిగుబడిని ఒడ్డుకు వేస్తున్నాయి. పత్తి, మిరప పంటలకు తప్పా.. ప్రతి పంట కోతకు మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో కూలీల ఖర్చు తగ్గడమే గాక సమయం ఆదా అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

అవస్థలకు చెల్లు..

గతంలో వరి పంట నూర్పిడికి రైతులు నానా అగచాట్లు పడేవారు. ముందుగా కూలీలతో కోతకోసి అనంతరం పడుగేసి ట్రాక్టరుతో తొక్కించి ధాన్యాన్ని గాలికి తర్పారబట్టి సంచులకు నింపేవారు. ఈ తతంగం అంతా కనీసం రెండు వారాలు పట్టేది. ప్రస్తుతం వరికోత మిషన్ రావడంతో కేవలం గంట సమయంలోనే వడ్లు ఇంటికి చేరుతున్నాయి. ఎకరాకు ఈ మిషన్‌కు గంటకు సుమారు రూ.3వేల వరకు చెల్లిస్తున్నారు. మినుము నూర్పిడికి ఎకరాకు రూ.2,500 చెల్లిస్తున్నారు. ఈ మిషన్.. శనగ, మొక్కజొన్న, గోధుమ, ఆవాల పంటలను కోతకోసి నూర్పిడి చేస్తుంది. ఇక ఎత్తైన పంటలైన జొన్న, సజ్జ, మొక్కజొన్న, కంది పంటల కోత ప్రస్తుతం సులభంగా మారింది.


వరి కోస్తున్న చైన్ మిషన్

డ్రోన్ సాయం..

పంటలకు కూలీలతో పురుగు మందును పిచికారీ చేయాలంటే ఖర్చు, శ్రమతో కూడుకున్నది. ఒక్కో కూలీకి రూ.700 ఇవ్వాలి. అది కూడా ఎకరం పంటకు మందు పిచికారీ చేయాలంటే ఇద్దరు అవసరం. డ్రోన్‌తో అయితే ఎకరానికి రూ.500తో ఐదు నుంచి పది నిమిషాల్లో పూర్తవుతుంది. డ్రోన్‌ను వరి, కంది, పత్తి, మొక్కజొన్న పంటల పిచికారీకి ఉపయోగిస్తున్నారు.

వరిగడ్డిని చుట్టలా చుట్టి..


వరిగడ్డిని చుట్టలు చుట్టేస్తున్న మిషన్

పశువులకు ప్రధాన ఆహార వనరు వరిగడ్డి. వరి కోత యంత్రాల ద్వారా గడ్డి వృథా అయ్యేది. దీంతో పశువులకు గ్రాసం కొరత ఏర్పడేది. ప్రస్తుతం వరిగడ్డిని చుట్టలు చుట్టే యంత్రం అందుబాటులోకి రావడంతో సులభంగా గడ్డిని చుట్టేస్తుంది. ఒక చుట్టను చుట్టినందుకు రూ.30 వసూలు చేస్తున్నారు. ఈ చుట్టలు ఇంటికి తెచ్చుకోవాడానికి, వాములు వేసుకోవడానికి, మేత వేసేందుకు సులభంగా ఉంటోంది.

గ్రాసం కోసం..

బెండ కంకలను నూర్పిడి చేస్తున్న యంత్రం ట్రాక్టరు సాయంతో పనిచేస్తుంది. ఈ యంత్రం ద్వారా కంది, శనగ, జొన్న, మినుము, వేరుశనగ పంటలకు సంబధించిన పొట్టు కావాల్సిన రైతులు ఇళ్ల వద్దకు తెచ్చుకొని నూర్పిడి చేయించుకుంటారు. పొలాల్లో ఆడే యంత్రాల ద్వారా పొట్టు వృథా కాకుండా ఈ మిషన్‌ను ఉపయోగిస్తారు. ఈ యంత్రం ద్వారా క్వింటా ధాన్యం నూర్పిడి చేస్తే రూ.150 వరకు తీసుకుంటారు.


నూనె, మసాల దినుసులు కొనేవారు లేక విశ్రాంతి తీసుకుంటున్న వ్యాపారి.


కొనుగోలుదారుల కోసం వేచి చూస్తున్న మహిళా వ్యాపారులు

కొనేవారు లేక!

- వెలవెలబోయిన చాగలమర్రి వారపు సంత
- చుట్టుపక్కల గ్రామాల నుంచి రాని ప్రజలు


కొనుగోలుదారులు లేక సెల్ ఫోన్ వీక్షిస్తున్న కూరగాయల వ్యాపారులు

చాగలమర్రి: నిత్యావసర సరుకులు, కొన్ని కూరగాయల ధరలు ఆకాశాన్నంటటంతో దిగువ, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో స్థానిక పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన సంత కొనుగోలుదారులు లేక వెలవెలబోయింది. సంత మార్కెట్‌లో దుకాణాలను నిర్వహిస్తున్న వారు వ్యాపారం జరిగినా జరగకపోయినా పంచాయతీ వారు విధించిన గేటు రుసుము తప్పక చెల్లించాలి. అంతే కాకుండా కూరగాయల దుకాణాలు నిర్వహించే వారు రూముల వేలం పాటలో ఒకరికి ఒకరు పోటీ పడి మరి వేలకు వేలు వెచ్చించి రూములు అద్దెకు దక్కించుకున్నారు. వ్యాపారాలు లేక రెండు నెలలుగా తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంతలో కందిపప్పు కిలో రూ.180, తెల్లగడ్డలు రూ.300, ఉల్లిగడ్డలు రూ.50–రూ.70 పలుకుతుండగా కూరగాయలు టమాట మినహా.. మిగతావి రూ.60 – రూ.100 వరకు ధరలు పలుకుతున్నాయి. ఇక ఆపిల్ రూ.150–రూ.220, కమలాలు రూ.80–రూ.110 పలికాయి. ధరలు అధికంగా ఉండటంతో సంత మార్కెట్‌లో కొనుగోలుకు ప్రజలు రావటానికి భయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నిత్యావసర సరుకులు, కూరగాలు, పండ్ల ధరలు ఆకాశన్నంటుతున్నా నియంత్రణ లేదు. ప్రతి బుధవారం చాగలమర్రిలో జరిగే వారపు సంత మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో కళకళలాడేది. అధిక ధరల కారణంగా జనం రాలేదు.